క్లుప్తంగా

చరిత్రలో నిలిచేలా షాదీఖానా నిర్మించాం



దాచేపల్లి : ముస్లిం, మైనార్టీల కోసం చరిత్రలో నిలిచేలా షాదీఖానా నిర్మాణం చేపట్టామని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. దాచేపల్లిలోని చాపలగడ్డలో కోటిరూపాయల వ్యయంతో నిర్మాణం పూర్తి చేసుకున్న షాదీఖానాను బుధవారం ఆయన పరిశీలించారు. షాదీఖానా నిర్మాణం పట్ల ఎమ్మెల్యే కాసు సంతృప్తి వ్యక్తం చేసి కమిటీ సభ్యులను అభినందించారు. ఈ నెల 8వ తేదీన ప్రారంభించనున్న షాదీఖానా ఆహ్వాన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తన దృష్టికి షాదీఖానా అంశాన్ని ముస్లిం మత పెద్దలు తీసుకువచ్చారని, తక్షణమే కోటిరూపాయల నిధులు మంజూరు చేయించానని చెప్పారు. నాణ్యత ప్రమాణాలతో షాదీఖానా నిర్మించి ఇచ్చిన మాటను నిలబెట్టుకునేలా ఏసీలు కూడా అమర్చామని తెలిపారు. రానున్న రోజుల్లో ముస్లిం, మైనార్టీలను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా బలోపేతం చేసేందుకు శక్తివంచనలేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.

తుఫాన్ నష్టంపై అధికారులతో సమీక్ష..

తుఫాన్ నష్టంపై అధికారులతో ఎమ్మెల్యే కాసు నారాయణపురం ఆర్‌అండ్‌బీ బంగ్లాలో సమీక్ష జరిపారు. మండల వ్యాప్తంగా ఎంత పంటనష్టం జరిగింది..నష్టం వివరాలు పూర్తిస్థాయిలో సేకరించాలని అధికారులను కోరారు. పంటనష్టం జరిగిన రైతులకు పూర్తిగా అండగా ఉండాలని, ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. అంతకు ముందు దాచేపల్లి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలన చేసి లబ్ధిదారులతో మాట్లాడారు. ఎమ్మెల్యే కాసు వెంట నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు షేక్ సుభానీ, కోట కృష్ణ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, మాజీ సర్పంచ్ మందపాటి రమేష్‌రెడ్డి, వైస్ చైర్మన్లు షేక్ ఖాదర్‌భాషా, కొమెరబత్తిన విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్‌సత్తార్, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు షేక్ సైదా, మార్కెట్ యార్డు డైరెక్టర్ బుగ్గల జానీ, షాదీఖానా కమిటీ సభ్యులు షేక్ సైసావలి, షేక్ పూలకొట్టు జాను, బుగ్గల జానీబాషా, షేక్ అబ్బాసల్లి మాబుసుభానీ, నాయకులు సయ్యద్ మౌలాలీ, కుంకులగుంట మస్తాన్, షేక్ జానీ పాల్గొన్నారు.

పంటలకు నష్టపరిహారం చెల్లించండి


వెల్దుర్తి: వర్షాలకు దెబ్బతిన్న పంటలకు వెంటనే నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సాయి మార్కొండారెడ్డి అన్నారు. బుధవారం వెల్దుర్తిలోని సచివాలయాన్ని సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం వలన జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసి వెంటనే రైతులకు నష్టపరిహారం అందేలా చూడాలని జిల్లా అధికారులను కోరామన్నారు. వర్షం వలన పంట పొలాలలో నిల్వ ఉన్న నీటిని రైతులు బయటకు పంపాలన్నారు. పత్తి, మిర్చి పంటలలో 5శాతం యూరియా పిచికారీ చేయాలన్నారు. పూత, కాయ దశలో ఉన్న పంటలలో ఫార్ములా 4, 19:19:19, సూక్ష్మ పోషకాలు పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ పుల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కోట్ల పాపిరెడ్డి, చింతా ఆదినారాయణ, కేసిరెడ్డి పిచ్చిరెడ్డి, పులుసు నారాయణరెడ్డి, వీఏఏలు సందీప్, రామారావు తదితరులున్నారు.

గుండెపోటుతో కౌలు రైతు మృతి



దాచేపల్లి : గుండెపోటుకు గురై కౌలురైతు మృతి చెందిన ఘటన బుధవారం దాచేపల్లిలో జరిగింది. దాచేపల్లికి చెందిన యర్రంశెట్టి పెదనరసింహారావు(49)తన పొలంలోనే గుండెపోటుకు గురై మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నరసింహారావు 4 ఎకరాలు పొలం కౌలుకు తీసుకుని 2.5 ఎకరాల్లో పత్తి, 1.5 ఎకరాల్లో మిరప పంటను సాగు చేస్తున్నాడు. తుఫాన్ నేపథ్యంలో దెబ్బతిన్న పంటలను చూసేందుకు తన కుమారుడితో కలిసి వెళ్లాడు. తడిసిన పత్తి, మిరప కాయలను చూసి గుండెపోటుకు గురై కుప్పకూలి కిందపడ్డాడు. కుమారుడు హాస్పిటల్‌కు తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కౌలుకు సాగు చేయటం వలన దిగుబడి రాకపోవటంతో రూ.10 లక్షల వరకు అప్పు ఉందని భార్య రమణ, కుటుంబ సభ్యులు తెలిపారు.

అరుణాచలం బస్సును సద్వినియోగం చేసుకోండి



మాచర్ల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణాచలంకు డిసెంబర్ 24వ తేదీన మాచర్ల నుంచి బయలుదేరనున్న సూపర్‌లగ్జరీ ఆర్టీసీ బస్సును భక్తులు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ ఆర్ పిచ్చయ్య కోరారు. బుధవారం ఆయన బస్టాండ్‌లో విలేకరులతో మాట్లాడుతూ అరుణాచలం బస్సు వివరాలను తెలిపారు. డిసెంబర్ 24న సూపర్‌లగ్జరీ బస్సు రాత్రి 7 గంటలకు బయలుదేరుతుందన్నారు. తిరిగి 27వ తేదీన మాచర్లకు వస్తుందన్నారు. ఒక్కొక్కరికి రూ.2,700 టికెట్టు ధర ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 73828 95100, 7382801048ను సంప్రదించాలన్నారు.



వర్షానికి పడిపోయిన వరిపంటను ఒదేలు కడుతున్న రైతు



భారీ వర్షం కారణంగా నేలవాలిన వరి పంట



పిన్నెల్లిలో నేలమట్టం అయిన అరటి తోట

స్తంభించిన జనజీవనం

- నేల వాలిన పంట పొలాలు..కూలిన మట్టి మిద్దెలు
- జలకళ సంతరించుకున్న వాగులు



కారెంపూడిలో వరద నీటితో ప్రవహిస్తున్న నాగులేరు

కారెంపూడి: మిచాంగ్ తుపాను తీవ్ర రూపం దాల్చడంతో గాలులతో కూడిన రెండు రోజులు కురిసిన వర్షాలతో మండలంలో దాదాపు అన్ని పంటలకు పాక్షిక నష్టం జరిగింది. రోడ్లు గుంతలు పడి పాడైపోయాయి. నాలుగు మట్టి మిద్దెలు నేలకూలాయి. ఇదిలా ఉంటే వాగులు వంకలు నీటితో ప్రవహించాయి. చుక్క నీరు లేక ఎండిపోయిన నాగులేరు వాగు కూడా జలకళ సంతరించుకుంది. ఈ వర్షాలతో భూగర్భ జలాలు పెరిగాయి. కోతకు వచ్చిన వరి పైర్లన్నీ దాదాపు నేలకూలాయి. లోతట్టు ప్రాంతాలలో వరి పైరు ప్రస్తుతం నీటిలో ఉంది. అలాగే కాయ దశలో ఉన్న మిర్చి పంటకు నష్టం వాటిల్లింది. కాయలు తడిసి తాలు కాయలు, కాయ కుళ్లు వచ్చే అవకాశం ఏర్పడింది. కాపు దశలో ఉన్న కంది పంట కూడా గాలులకు వాలిపోయింది. లేత దశలో ఉన్న మొక్కజొన్న పైరు కూడా వాలింది. ఇదిలా ఉంటే మంగళవారం మధ్యాహ్నం నుంచి రాత్రి 10 గంటల విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. సెల్ ఫోన్ల సిగ్నల్స్ నిలిచిపోయాయి. రెండు రోజుల వర్షంతో జన జీవనం స్తంభించిపోయింది. బుధవారం వర్షం ఆగింది. చింతపల్లిలో మంగళవారం అర్ధరాత్రి మట్టి మిద్దె కూలిపోయింది. అలాగే కారెంపూడిలో, నరమాలపాడులో ఒకటి చినగార్లపాడు మరో మట్టి మిద్దె కూలిపోయాయని తహసీల్దార్ జి.శ్రీనివాస్ తెలిపారు. నష్టపరిహారం కోసం అధికారులకు నివేదిక పంపారు. మండలంలో పంట నష్టాన్ని అంచనా వేస్తున్నామని వ్యవసాయశాఖ అధికారి యలమందారెడ్డి తెలిపారు.

రెండో రోజులు భారీ వర్షం

మాచర్ల: మాచర్ల నియోజకవర్గంలో భారీగా రెండవ రోజు మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు జోరుగా వర్షం కురిసింది. మాచర్ల మండలంలో 51మి.మీ, వెల్దుర్తి మండలంలో 31.6.మి.మీ, దుర్గిలో 62 మి.మీ, రెంటచింతలలో 32.2 మి.మీ, కారెంపూడిలో 99.6మి.మీల వర్షపాతం నమోదైంది. మొత్తంగా మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో వర్షాభావం ఎదుర్కొంటున్న మండలాల్లో భారీ స్థాయిలో వర్షం కురిసి రోడ్లు, పొలాలు జలమయంగా మారాయి. వర్షం అధికంగా కురవటంతో రైతులు ఆందోళన చెందే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా వరి పంటకు సంబంధించి కోతకు వచ్చిన పంట వర్షం ప్రభావంతో నష్టపోయామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కూలిన మట్టి మిద్దె.. తప్పిన ప్రమాదం

దుర్గి: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ముటుకూరు గ్రామంలో తిరువీధుల చినరామయ్యకు చెందిన మట్టిమిద్దె అర్ధరాత్రి కూలిపోయింది. అప్పటి వరకు ఇంట్లో నిద్రిస్తున్న కుటుంబ సభ్యులు వర్షం నీరు పై నుంచి రావడంతో మెలుకువ వచ్చి వెంటనే అక్కడి నుంచి తప్పుకోవడంతో ప్రాణనష్టం తప్పింది. విషయం తెలుసుకున్న ఎంపీపీ ఏసూరి సాయిశంకర్ ఘటనా స్థలానికి చేరుకొని బాధితులను ఓదార్చారు. జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపి నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ తమకు సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

తుఫాన్ కారణంగా దెబ్బతిన్న వరి, పండ్ల తోటలు

మాచవరం: తుఫాన్ ప్రభావంతో మండలంలోని పలు గ్రామాల్లో కురిసిన భారీ వర్షాలకు వరి, మిర్చి, పండ్ల తోటలు, కూరగాయ పంటలు దెబ్బతిన్నాయి. పలుచోట్ల కోతదశలో ఉన్న వరి పైర్లు నేలకొరిగాయి. ఈదురు గాలుల ప్రభావంతో పలు గ్రామాల్లో కాపుదశలో ఉన్న అరటిపంట నేలమట్టం కావడంతో రైతులకు నష్టం వాటిల్లింది. బొప్పాయి పంటలు దెబ్బతిన్నాయి. మిర్చి తోటలు గాలికి వాలిపోవడంతో వాటిని నిలబెట్టడం రైతులకు అదనపు భారంగా మారింది. వర్షానికి మిర్చి తాలుకాయలు అయ్యే అవకాశం ఉంది. మిర్చి పంటను కాపాడుకునేందుకు ఉద్యానశాఖ అధికారులు పలు సలహాలు, సూచనలు తెలియజేశారు. వర్షాలకు దెబ్బతిన్న పంటనష్టాన్ని అంచనా వేసేందుకు వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ అధికారులు పలు గ్రామాల్లో పర్యటించారు.

తుఫాన్‌తో అల్లాడుతున్న రైతన్నలు

రెంటచింతల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా బలపడి తుఫాన్‌గా మారి మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఈ అకాల తుఫాన్ కారణంగా వరిపంట నేలకూలి రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు తహసీల్దార్ కె.పుల్లారావు దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. రెంటచింతల, పశర్లపాడు, జెట్టిపాలెం, రెంటాల తదితర గ్రామాల్లోని మిర్చి పొలాల్లో వర్షపు నీరు చేరడంతో కొంత మేర నష్టం జరిగినట్లు తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు పాలువాయి, రెంటాల, మంచికల్లు, రెంటచింతల, పాలువాయిగేటు, మిట్టగుడిపాడు గ్రామాల్లో సుమారు 157 హెక్టార్లలో వరి పంట దెబ్బతిన్నట్లు గుర్తించి ఉన్నతాధికారులకు నివేదికను పంపించినట్లు ఏఓ బోయపాటి బ్రహ్మారెడ్డి తెలిపారు. మిర్చి పంటలో వర్షపు నీరు నిలిచి ఉండటంతో కొంత నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. ముందుగా వర్షపు నీరు బయటకు పంపించి సస్యరక్షణ చేపట్టాలని సూచించారు.

మిర్చి రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

పిడుగురాళ్లరూరల్: మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో మిర్చి రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యానవన శాఖ అధికారి వై.మోహన్ అన్నారు. పట్టణం, మండలంలోని నీట మునిగిన మిరప పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అధిక వర్షాల వలన లోతట్టు ప్రాంతాల్లో నీరు నలబడి మిరప పంట ముంపునకు గురై నష్టం వాటిల్లుతుందన్నారు. పంటను పురుగులు, తెగుళ్లు ఆశించడమే కాకుండా సూక్ష్మధాతు లోపాలు కూడా కనబడే అవకాశముందన్నారు. పంట దశ, ముంపు ఉధృతిని బట్టి తగిన జాగ్రత్తలు పాటించినట్లయితే పంటను రక్షించుకొని నష్టాన్ని కొంత వరకు తగ్గించుకునే అవకాశం ఉందన్నారు. పొలంలో అధికంగా ఉన్న నీటిని వెంటనే బయటికి పంపించే ఏర్పాటు చేసి, వాలిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదలు చుట్టూ మట్టిని ఎగదోయాలన్నారు.

తుఫాన్ ప్రభావంతో రైతాంగం ఆందోళన

దుర్గి: మీచాంగ్ తుఫాన్ ప్రభావంతో గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు మండల పరిధిలోని అడిగొప్పల గ్రామంలో కోతకు వచ్చిన వరి పంట నేలకొరిగింది. కొంత మంది రైతుల వరి పంట కల్లాల్లో ఉంది. భారీ వర్షం మూలంగా వరి పంట గింజలు తడిసిపోయి మొలకెత్తే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మిర్చి పంట మండల వ్యాప్తంగా ముటుకూరు, దుర్గి, కంచరగుంట, ఆత్మకూరు, అడిగొప్పల, ఓబులేశునిపల్లె, ధర్మవరం తదితర గ్రామాల్లో మిర్చి మొక్కలు ఈదురు గాలులకు వంగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయాధికారులు, రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయిలో పర్యటన చేసి నష్టాలు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందే విధంగా కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రతి రైతన్నను ఆదుకుంటాం



వరి చేలో నీటిని బయటకు పంపుతున్న రైతు

మాచర్ల రూరల్: మిచాంగ్ తుఫాన్ జనజీవనాన్ని స్తంభింపజేసింది. ప్రధానంగా అన్నదాతలకు తీవ్రనష్టం వాటిల్లింది. వ్యవసాయ పంటలు నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నష్ట నివారణకు వ్యవసాయాధికారులు చర్యలు చేపట్టారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కోతకు సిద్ధంగా ఉన్న వరి చేలు నేల వాలిపోయాయి. మిర్చి పొలాల్లోకి నీరు చేరి మొక్కలు ఉరకలెత్తుతున్నాయి. తుఫాన్ ముందస్తు హెచ్చరికలతో వరికోతలను కోసి సురక్షిత ప్రాంతాలకు మిల్లులకు తరలించేందుకు అధికారులు రైతులను సమాయత్త పరచి కొంత వరకు నష్టాన్ని నివారించారు. రైతులకు భరోసా ఇస్తూ ధైర్యం కల్పించారు. మండలంలోని కంభంపాడు, గన్నవరం, జమ్మలమడక, పశువేముల, కొత్తూరు, 7వ మైలు తదితర గ్రామాల్లో బోర్ల కింద వరిసాళ్ళు చేసుకునే రైతులకు నష్టాన్ని చేకూర్చాయి. అలాగే మిర్చి రైతుల పొలాల్లో నీరు నిల్చిపోయి మొక్కలు ఉరకెత్తి కుళ్ళిపోయే పరిస్థితి రావటంతో వారు ఆందోళన చెందుతున్నారు.

ప్రాథమిక అంచనాలు రూపొందించాలి..



మిచాంగ్ తుఫాన్ వలన పల్నాడు ప్రాంతంలోని ప్రతి రైతును ఆదుకుంటాం. పంట నష్టంపై వ్యవసాయ, ఉద్యానవన శాఖలు ప్రాథమిక అంచనాలు రూపొందించాలని, ఇప్పటికే ఉన్నతాధికారులను ఆదేశించాం. తడిసిన ప్రతి గింజను నాణ్యమైన రేటుకే కొనుగోలు చేసేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నతాధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారన్నారు. తుఫాన్ ముందస్తు హెచ్చరికలతో సంబంధిత అధికారులంతా నష్ట నివారణ చర్యలు తీసుకోవటం వలన చాలా వరకు నష్టాన్ని అధిగమించగలిగామన్నారు.

– ఎమ్మెల్యే పీఆర్కే

పంట నష్టాన్ని అంచనా వేస్తాం..



మిచాంగ్ తుఫాన్ వలన పంటలకు జరిగే నష్టాన్ని అంచనా వేసేందుకు అధికారులంతా సిద్ధంగా ఉన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు ఇప్పటికే ఆయా గ్రామాలలో ప్రాథమిక అంచనాలు వేశాం. పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా రైతులందరినీ ఆదుకుంటాం.

– జగదీశ్వరరెడ్డి, ఏడీఏ, మాచర్ల

బీఆర్ అంబేడ్కర్ సేవలు ప్రశంసనీయం



అంబేడ్కర్ విగ్రహం వద్ద మున్సిపల్ చైర్మన్, పలువురు ఎస్సీ సంఘ నాయకులు



అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకుడు మార్కు, తదితరులు



అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, ఎంపీపీ చాడేశ్వరి



దాచేపల్లిలో అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

మాచర్ల: డా. బీఆర్ అంబేడ్కర్ సేవలు మరువలేనివని ఆయన బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం కష్టపడి రాజ్యాంగాన్ని రూపొందించి పేద ప్రజలకు హక్కులు కల్పించిన మహనీయుడని మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు అన్నారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ పార్కులో ఆయన విగ్రహానికి మున్సిపల్ కౌన్సిలర్లు మందా సంతోష్, వేల్పుల గురవయ్య, జగన్నాథం, అల్లి జీవన్‌తో పాటు, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు రాజు, కందుకూరి రత్నరాజు, పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు మాచర్ల రామారావు, కంభంపాటి మోషే, బొంగురుతో పాటు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ అంబేడ్కర్ సేవలను కొనియాడారు.

వివిధ సంఘాల ఆధ్వర్యంలో..

పట్టణంలోని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు కందుకూరి రత్నరాజు, కంభంపాటి మోషే ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా దళిత బహుజన ఫ్రంట్ నాయకులు కుక్కమూడి ప్రసాద్ ఆధ్వర్యంలో పట్టణంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు సంఘ నాయకులు మాచర్ల దానియేలు కుమారుడు రవి, జాన్, వాసు ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.

అంబేడ్కర్ ఆశయాలు సాధించాలి

దాచేపల్లి : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు సాధించాలని జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ 67వ వర్ధంతి కార్యక్రమం దాచేపల్లిలో బుధవారం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జీ కరుణకుమార్, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, మాజీ సర్పంచ్ మందపాటి రమేష్‌రెడ్డి, షేక్ సుభానీ, వైస్ చైర్మన్లు షేక్ ఖాదర్‌భాషా, కొమెరబత్తిన విజయ్‌కుమార్, కౌన్సిలర్లు చాట్ల క్రాంతికుమార్, నాగుబండి గురువులు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ బుగ్గల జానీ, నాయకులు ఏసుపాదం, హనుమంతరావు, దానియేలు, సైదా, శ్రీనివాసరావు, ఏర్రయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు పని చేద్దాం

పిడుగురాళ్లరూరల్: అంబేడ్కర్ ఆశయాల కోసం పని చేద్దామని మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అన్నారు. ఆయన అడుగు జాడల్లో నడవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. ముందుగా పట్టణంలోని ఐలాండ్ సెంటర్, పోలీస్ స్టేషన్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సమాచార శాఖ మాజీ కమిషనర్ రేపాల శ్రీనివాసరావు, పట్టణ కన్వీనర్ చింతా రామారావు, ఎంపీపీ అల్లు సత్యవతిపిచ్చిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన కొమెర వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ షేక్ జైలాబ్దీన్, బీసీ నాయకులు కుందుర్తి గురవాచారి, కో ఆప్షన్ మెంబర్ పిల్లి ప్రేమానందం, ఎస్సీ సెల్ అధ్యక్షులు కాలే మాణిక్యరావు, పట్టణ యూత్ అధ్యక్షులు మందా సుధీర్, కౌన్సిలర్లు పసుపులేటి ఆనంద్‌బాబు, అజిమ్మర శారద, కొక్కెర శ్రీనివాసరావు, జాని, మార్కెట్‌యార్డు డైరెక్టర్లు చల్లగుండ్ల స్వామి, జాషువా, బీసీ సెల్ అధ్యక్షులు కందులూరి శివయ్య, గురజాల నియోజకవర్గ నాయకులు గొట్టిముక్కల పవన్‌రెడ్డి, మైనార్టీ యూత్ నాయకులు ఎండీ అలీం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి

విజయపురిసౌత్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 67వ వర్ధంతి కార్యక్రమాన్ని విజయపురిసౌత్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకుడు ఊరే మార్కు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగం పట్ల గౌరవభావం పెంపొందించుకోవాలన్నారు. ఆయన బడుగు, బలహీన వర్గాల కోసం పాటుపడ్డ మహనీయుడని, కుల వివక్షకు వ్యతిరేకంగా గళం విప్పి బడుగు వర్గాలకు ఆత్మగౌరవాన్ని ప్రసాదించిన రాజ్యాంగ రూపకర్త అని కొనియాడారు. దీనికి ముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాల ఐక్యవేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి చీకూరిమల్లి రాంప్రసాద్, బుర్రకథ కళాకారుడు వంకాయలపాటి రామదాసు, బీర్నీడి నాగేశ్వరరావు, సిద్దెల దానియేలు, కుంచెం ఏసుదానం, పురాణం శ్రీను పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోండి

వెల్దుర్తి: భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న బీఆర్ అంబేడ్కర్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సాయి మార్కొండారెడ్డి అన్నారు. బుధవారం వెల్దుర్తి బస్టాండ్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ వర్ధంతిని ప్రపంచ వ్యాప్తంగా జరుపుకోవటం సంతోషించదగ్గ విషయమన్నారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ద్వారా రిజర్వేషన్లు పొందుతున్నారన్నారు. అనంతరం వెల్దుర్తి ఆర్బీకే సెంటర్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కోట్ల పాపిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పులుసు నారాయణరెడ్డి, కేసిరెడ్డి పిచ్చిరెడ్డి, చింతా ఆదినారాయణ, కేసిరెడ్డి వెంకటరెడ్డి, పార్లపల్లి గాలయ్య, పిన్నెబోయిన మార్కొండయ్య పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్

రెంటచింతల: భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేడ్కర్ నేటి యువతకు స్ఫూర్తి ప్రదాత అని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శౌంతిరెడ్డి నర్సిరెడ్డి అన్నారు. బుధవారం అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఆయన ఎంపీపీ దాసరి చొడేశ్వరి, మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ యార్ల మహాలక్ష్మి, కార్యాలయ సిబ్బందితో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. అణగారిన జాతులను అత్యంత ప్రభావితం చేసిన మహావ్యక్తి...కుల నిర్మూలన కోసం స్వేచ్ఛ, సమానత్వం కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. మండల కాంగ్రెస్ పార్టీ, ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో రెంటచింతల గ్రామంలో అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి, ఈఓపీఆర్డీ జి.అనంత కోటేశ్వరరావు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి రాగిడి ప్రతాప్, మహాజన సోషలిస్టు జిల్లా నాయకులు గాడిపర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వెల్దుర్తిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వ్యవసాయ సలహా మండలి చైర్మన్



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమంలోనాయకులు

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన



రాయవరంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మాచర్ల రూరల్: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ప్రతి ఒక్క కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించిన జగనన్ననే మళ్లీ సీఎంగా చేసుకుందామని మండల పార్టీ సీనియర్ నాయకుడు బూడిద శ్రీనివాసరావు కోరారు. బుధవారం రాత్రి మండలంలోని రాయవరం గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. నాలుగున్నరేళ్లుగా ప్రతి ఇంటికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మేలు కల్పించి ఆర్థిక భరోసా కల్పించిన నేత జగనేనన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు మండ్లి పెద మల్లుస్వామి, గొర్రెల పెంపకం దార్ల సంఘం చైర్మన్ బూడిద సైదులు, వైఎస్సార్‌సీపీ నాయకులు చామకూర వెంకటేశ్వరరెడ్డి, ఆరికట్ల చంద్రారెడ్డి, సర్పంచ్ సుందరలీల, ఎంపీటీసీ శైలజ, మాజీ సర్పంచ్ నాగెండ్ల శ్రీనివాసరావు, సీహెచ్ ప్రభాకర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి తదితరులున్నారు.

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్

మోర్జంపాడు శాఖ, మోర్జంపాడు గ్రామం, మాచవరం మండలం
పల్నాడు జిల్లా - 522413. ఫోన్: 9100910471

బంగారు నగల వేలము నోటీసు

[illegible] 5.15-12-2023, [illegible] 3-30 [illegible] 5.15-12-2023 మధ్యాహ్నం 2-00 గం॥లలోపు [illegible] రూ.5000/- [illegible]

అకౌంట్ నెంబరు	ఋణగ్రహీత పేరు మరియు చిరునామా	[illegible]
70153003418948	శ్రీ షేక్ ఖాన్ సాహెబ్, తండ్రి: సైదా హుస్సేన్, మోర్జంపాడు–522413.	10

ముఖ్య నిబంధనలు: 1. పైన తెలిపిన ఋణగ్రహీతలకు గతంలో జారీ చేసిన నోటీసుకు [illegible]
2. [illegible]
3. [illegible] 2.00 [illegible]
4. [illegible] 4.00 [illegible]
5. [illegible]
6. [illegible]
7. [illegible]
8. [illegible]

తేది: 06-12-2023, స్థలం: మోర్జంపాడు — [illegible]